https://teluguislam.net



# 17 - తావీజు మరియు మంత్రించడం ధర్మ పరిధిలో

**తావీజు:** మన సమాజంలో అనేక మంది ప్రజలు తావీజుల మహిమను దృడంగా నమ్ముతారు. చిన్న, పెద్ద, ఆడ, మగ అనే తేడాలు లేకుండా మరియు ధర్మాలకు అతీతంగా తమ తమ మూఢ నమ్మకాల ప్రకారం **''తావీజు''ల**ను వాడుతారు. అవి వారి వద్ద ఉన్నంత వరకూ నష్టాల నుండి, భయాల నుండి, అనారోగ్యాల నుండి బలహీనత నుండి అపజయం నుండి కాపాడే మహిమగా భావిస్తారు.

తావీజును అనేక రకాలుగా వాడుతారు. ఉదాహరణకు: కొందరు దారాలకు మంత్రించి ముడిలు వేసి, కొందరు ఖుర్ఆన్ ఆయతులను లేక దుఆలను వివిధ రేకులపై వ్రాసి, చిన్న పొట్లంలా కట్టి చేతికి లేక మెడకి కట్టుకుంటారు. అలాగే కొంత మంది కొన్ని ఫోటోలను తావీజులా కట్టుకుంటారు. లేక జేబులో ఉంచుకుంటారు. మరియు కొంత మంది తమ బండ్లలో, దుకాణాలలో, ఇండ్లలో, డబ్బులు ఉంచుకునే గల్లాలలో శుభాలను ఆశిస్తూ ఖుర్ఆన్ లేక తావీజులను ఉంచుకుంటారు. మరియు కొంత మంది ప్రజలు పుణ్యాత్ముల ఫోటోలను, విగ్రహాల ఫోటోలను కూడా శుభాలుగా భావించి తమ వద్ద ఉంచుకుంటారు. మరియు కొందరు రంగురంగుల రాళ్ళను, రత్నాలను ముత్యాలను శుభాలుగా భావించి ఉంగరాలుగా ధరిస్తారు.

ఎవరైతే తావీజులను తయారు చేసి అమ్ముతున్నారో వారు ప్రజల అమాయకత్వాన్ని మరియు వారి అవసరాన్ని పసిగట్టి ఒక పెద్ద మొత్తానికి

https://teluguislam.net



తావీజులను అమ్ముతుంటారు. మరియు దాని వలన అనేక మంది ప్రజలు ప్రయోజనం పొందినట్లు నమ్మిస్తారు. ఇటువంటి మూఢ నమ్మకాలు మరియు విశ్వాసాలు ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) రాక ముందు నుండి సమాజంలో ఉన్నాయి.

**తావీజు అర్థం:**

**''తావీజు''** అనే పదానికి అరబీలో: **ఇవజ్, మఆజ్, ముఆజహ్** అనే అనేక పదాలున్నాయి. అరబీ నిఘంటువులో దాని అర్థం: **'శరణు కోరడం'** మరియు **'భద్రత కోరడం'.**

ఖుర్ఆన్ గ్రంథంలో పలుచోట్ల **'అల్లాహ్ శరణు'** పొందాలంటు ఉన్నది. కనుక 'అవూజు బిల్లాహి'అనే పదం కొన్ని సూరాల ప్రారంభంలో ఉంది మరియు ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) అనేక దుఆల పదాలను **'అవూజు'** అనే పదంతోనే ప్రారంభించారు.

ఇస్లామీయ ధర్మ ప్రకారం: **''తావీజు''** అంటే **'అల్లాహ్ శరణు'** పొందుటకై దుఅలలో వాడబడే పదం. కనుక **''అవూజు బిల్లాహి మినష్షైతాన్ నిర్రజీమ్'', ''ఖుల్ అవూజు బిరబ్బిన్నాస్''** మరియు హదీసులో **''అవూజు బికలిమాతిల్లాహిత్ తామ్మాతి....''** అని ఉంది.

అరబీ బాషలో **''తావీజు''** అంటే; మెడలో లేక శరీర భాగాలలో చుట్టుకునే దారాలు మరియు దుఆ పొట్లాలు కావు.

భారత దేశం, పాకిస్తాన్, బంగ్లాదేశ్ మరియు అఫ్ఘానిస్తాన్ వంటి దేశాలలో **''తావీజ్''** అంటే; మనిషికి వచ్చే అనేక సమస్యలను దూరం చేసుకొనుటకు, పవిత్రంగా భావించే దైవ వాక్యాలను లేక మూఢ నమ్మకాల ప్రకారం

https://teluguislam.net



వాడుకునే కొన్ని వస్తువులను ఒక చిన్న పొట్లంలో చుట్టి హారంలా మేడలో వేసుకొనే వస్తువును **'తావీజు'** అంటారు.

మనం **తావీజు** అని చెప్పుకునే పదాన్ని: అరబీలో **''తమీమా''** అంటారు. బహువచనంగా దానిని **''తమాయిమ్''** అని అంటారు. అరబీలో **''తావీజు''** అని వాడరు.

ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా తెలియజేసారు:

**(إِنَّ الرُّقَى وَالتَّمَائِمَ وَالتِّوَلَةَ شِرْكٌ) ''ఇన్నర్ రుఖా వత్ 'తమాఇమ్' వత్ తివలా షిర్కున్''** (నిశ్చయంగా మంత్రించడము, వ్రేలాడించే వస్తువులు (తమాయిమ్) మరియు ప్రేమను (దృష్టిని) తమవైపు మరల్చుకునే మంత్రాలు బహుదైవారాధన అవుతుంది).

(అబూదవూద్:3883, అహ్మద్:1/381, అల్ అహాదీస్ అస్సహీహా:331)

## తావీజులు (తమీమా) వేసుకోవడం నిషిద్ధం:

హజ్రత్ ఇబ్ను మస్వూద్(రజియల్లాహు అన్హు) కథనం: ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం): ''మంత్రించడాన్ని, వ్రేలాడించే తావీజులను **(తమాయిమ్)** మరియు ప్రేమను (దృష్టిని) తమవైపు మరల్చుకునే మంత్రాలను నిషేధించారు.'' (సహీహ అల్ జామే అస్సగీర్:6757)

హజ్రత్ ఇబ్ను మస్వూద్(రజియల్లాహు అన్హు) ఇలా తెలియజేసారు; ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) **తమాయిమ్(తావీజుల)ను అయిష్టంగా భావించేవారు.** (ముసన్నిఫ్ అబీషైబా:5/427)

హజ్రత్ ఈసా బిన్ అబీలైలా (రజియల్లాహు అన్హు) ఇలా తెలియజేసారు: నేను ఒక రోజు అబ్దుల్లాహ్ బిన్ ఉకైమ్ గారిని పరామర్శించుటుక వెళ్ళాను.

ఆయన శరీరాన్ని చూస్తే జ్వరంతో ఎర్రబడి పోయింది. అది చూసి నేను: ''ఏదైన తావీజు వేసుకోవచ్చుగా'' అని అన్నాను. దానికి అబ్దుల్లాహ్ బిన్ ఉకైమ్ గారు: ''చావు దానికంటే మేలైనది'' అని అంటూ: ''ఎవరైతే (స్వస్థత) కొరకు ఏదైనా వ్రేలాడిస్తే అతను దానికే అప్పగించబడతాడు'' అన్న హదీసును తెలియజేసారు. (సహీహ్ వ జయీఫ్ సునన్ తిర్మీజీ: 5/72).

హజ్రత్ ఉఖ్బా బిన్ ఆమిర్ (రజియల్లాహు అన్హు) కథనం ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం)ప్రవచించగా నేను ఇలా విన్నాను:

**مَنْ تَعَلَّقَ تَمِيمَةً فَلَا أَتَمَّ اللَّهُ لَهُ وَمَنْ تَعَلَّقَ وَدَعَةً فَلَا وَدَعَ اللَّهُ لَهُ** (رواه أحمد وأبو يعلى وطبراني)

**''ఎవరైతే తమీమా (తావీజు)వేసుకుంటారో, అల్లాహ్ వారి (సంకల్పాన్ని) పూర్తి చేయకూడదు. మరియు ఎవరైతే గవ్వల(విదా)ను తొడుగుతారో, అల్లాహ్ వారిని ఎలాంటి మేళ్ళను ప్రసాదించకూడదు.**

(అహ్మద్, అబూ యాలా, తబ్రానీ, మజ్మవుజ్ జవాయిద్: 5/103, తుహ్ఫతుల్ అహ్వజీ:3/171)

హజ్రత్ ఆమిర్ బిన్ అల్ జుహ్నీ (రజియల్లాహు అన్హు) కథనం; ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) వద్దకు పది మంది కలిసిన ఒక బృందం వచ్చింది. ఒక వ్యక్తిని మినహా, ఆయన వద్దకు వచ్చిన ప్రతి ఒక్కరి చేతిపై ప్రవక్త ముహమ్మద్(సల్లల్లాహు అలైహి వసల్లం) (విధేయత) ప్రమాణం తీసుకున్నారు. తరువాత వారు: ఓ ప్రవక్తా! ''మీరు మనలో వచ్చిన తొమ్మిది మందితో ప్రమాణం తీసుకున్నారు. ఆ ఒక్క వ్యక్తితో ప్రమాణం ఎందుకు తీసుకోలేదు?'' అని అడిగారు. దానికి ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం): ''అతను తమీమా వేసుకొని ఉన్నాడు'' అని అన్నారు. తరువాత అతను ''తన చేతితో దానిని తెంపాడు'' ఆ తరువాత ప్రవక్త (సల్లల్లాహు అలైహి

https://teluguislam.net



వసల్లం) గారు అతని చేతిపై కూడా ప్రమాణం చేసి, ఇలా అన్నారు. ''ఎవరైతే తమీమా (తావీజు) ధరిస్తారో వారు షిర్క్ కార్యానికి వడిగట్టినట్లే''.

(ముస్నద్ అహ్మద్:16781)

కనుక తావీజు (తమీమా) అనే వస్తువులు అది ఖుర్ఆన్ ఆయతులను లేక హదీసులలో ఉన్న దుఆలను, 'తావీజు'గా ఉపయోగించడం ధర్మం కాదు. మరియు సహాబాలు, తాబయీన్‌లు తావీజులను అనుమతించేవారు కాదు. అయిన కొంత మంది ధర్మ గురువులు ఖుర్ఆన్ మరియు దుఆలతో చేయబడిన తావీజులు వేసుకోవడం ధర్మంగా భావించారు. ఈ విషయంలో కొంత మంది ధర్మ గురువుల మధ్య విభేదాలున్నాయి.

ఏదైనప్పటికి ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం)నిషేధించిన తరువాత ఇతరులు వాడుతున్నారా? లేదా అని మనం ఆలోచించవలసిన అక్కర లేదు. ఎందుకంటే? అల్లాహ్ ఇలా తెలియజేశాడు:

**﴿ وَمَآ ءَاتَىٰكُمُ ٱلرَّسُولُ فَخُذُوهُ وَمَا نَهَىٰكُمْ عَنْهُ فَٱنتَهُوا۟ ۚ وَٱتَّقُوا۟ ٱللَّهَ ۖ إِنَّ ٱللَّهَ شَدِيدُ ٱلْعِقَابِ ﴿٧﴾ ﴾**
**الحشر: ٧**

**''దైవ ప్రవక్త మీకు దేనిని ఇస్తారో దాన్ని తీసుకోండి, మరియు ఆయన మిమ్మల్ని దేన్నుండి నిరోధిస్తారో దాని జోలికి పోకండి. అల్లాహ్‌కు భయపడండి, అల్లాహ్ కఠినంగా శిక్షించేవాడు.''** (సూరతుల్ హష్ర్: 7)